క్లుప్తంగా...

28 నుంచి అనంత పద్మనాభస్వామి వ్రతం

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పుప్పాల్‌గూడలోని అనంత పద్మనాభ స్వామి దేవాలయం ఆవరణలో గురువారం నుంచి వ్రతం నిర్వహిస్తున్నట్లు దేవాలయ కమిటీ అధ్యక్షుడు బట్ట సత్యనారాయణ తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వ్రతం ఉంటుందన్నారు. శుక్రవారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు సుదర్శన హోమం, అనంతరం అన్నదానం ఉంటుందని, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

జేసీబోస్ నేషనల్ ఫెలోగా హెచ్‌సీయూ ప్రొ.జయానంద



రాయదుర్గం: జేసీబోస్ నేషనల్ ఫెలోగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ ప్రొఫెసర్ ఎం జయానంద ఎంపికయ్యారు. హెచ్‌సీయూలోని సెంటర్ ఫర్ ఎర్త్, ఓషన్ అండ్ అట్మాస్పియరిక్ సైన్సెస్ సీనియర్ ప్రొఫెసర్, హెడ్‌గా జయానంద పనిచేస్తున్నారు. సాలిడ్ ఎర్త్ సైన్సెస్‌లో ఆయన చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా జేసీబోస్ నేషనల్ ఫెలోషిప్ లభించింది. ఆయనను పలువురు ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ ప్రతినిధులు అభినందించారు.

లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి సమస్యకు శాశ్వత పరిష్కారం



పనులను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ గాంధీ, జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద సుమారు రూ.4 కోట్లతో నిర్మించే బాక్స్ టైప్ డ్రైన్ పనులను ప్రభుత్వ విప్ ఆరికెపూడి గాంధీ మంగళవారం పరిశీలించారు. శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డితో కలిసి ఆయా పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ వరదనీటి సమస్య శాశ్వత పరిష్కార దిశగా లింగంపల్లి అండర్ బ్రిడ్జి వద్ద బాక్స్‌టైప్ డ్రైన్ పనులు చేపడుతున్నామన్నారు. వరద నీటి కాల్వ పనుల్లో వేగం పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ఈఈలు శ్రీనివాస్, శ్రీకాంతిని, డీఈ దుర్గాప్రసాద్, ఏఈలు సునీల్, సంతోష్‌రెడ్డి, ఏసీపీ మెహ్రా, మాజీ కౌన్సిలర్ లక్ష్మీనారాయణ గౌడ్, శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదం.. ఒకరికి స్వల్ప గాయాలు

రాజేంద్రనగర్: శివరాంపల్లి వాల్‌మార్ట్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువతికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. శంషాబాద్ నుంచి వస్తున్న ఓ కారు అదుపు తప్పి శివరాంపల్లి ప్రాంతంలోని రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. పక్కనే ఉన్న బస్టాప్‌లోకి దూసుకురావడంతో ప్రయాణికులు పక్కకు తప్పుకున్నారు. అదే సమయంలో ఓ యువతికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు ఆమెను చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

'పేదలకు అండగా మజ్లిస్ పార్టీ'

గోల్కొండ: మజ్లిస్ పార్టీ పేదలకు ఎప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. రెండవ విడత డబుల్ బెడ్ రూమ్ లక్కీడ్రాలో ఇళ్లు లభించిన వారు మంగళవారం ఆయనను టోలిచౌకిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు తమకు గూడు లభించిందని ఎమ్మెల్యే కౌసర్ వల్లే ఇది సాధ్యమైందని వారు అన్నారు.

లంబోదరుడికి విశేష పూజలు

రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలో వినాయకుడికి విశేష పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం అపార్ట్‌మెంట్లు, కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలు, ప్రధాన కూడలీలు, దేవాలయాలు మండపాల్లో ఏర్పాటు చేసిన వినాయకులకు రోజూ ఉదయం, సాయంత్రం సమయాల్లో ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. పూజలకు ప్రజాప్రతినిధులు, పలు పార్టీల నాయకులు హాజరై స్వామివారి ఆశీస్సులను పొందుతున్నారు.

– రాజేంద్రనగర్ జోన్ బృందం



ముప్పాజంక్షన్ సిగ్నియా గేటెడ్ కమ్యూనిటీలో..



అభ్యుదయనగర్ కాలనీలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



నార్సింగి వినాయకుని పూజలో కౌన్సిలర్ ఉషారాణి, మహిళలు



నార్సింగిలో కౌన్సిలర్లు ప్రవీణ్, ఉషారాణి



గౌలిదొడ్డిలో చైర్‌పర్సన్ రేఖాయాదగిరి



శివపురికాలనీలో స్థానికులు



రెయిన్‌వ్యాలీ అపార్ట్‌మెంట్‌లో చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

రాజేంద్రనగర్: పత్తికుంట వద్ద జరిగే నిమజ్జన ఏర్పాట్లను ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ వివిధ శాఖల అధికారులు, ఉత్సవ సమితి సభ్యులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ.. వినాయక నిమజ్జనాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని సూచించారు. శోభా యాత్ర జరిగే మార్గంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా రోడ్డు మరమ్మతులు చేపట్టాలని జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలని విద్యుత్‌శాఖ అధికారులను కోరారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు పోలీసులు పకడ్బందీ భద్రత ఏర్పాట్లను చేపట్టాలని ఆదేశించారు. కార్పొరేటర్ సంగీతాగౌరీశంకర్, ఉత్సవ కమిటీసభ్యులు వై.శ్రీధర్, డీసీపీ జగదీశ్వర్ రెడ్డి, ఏసీపీ గంగాధర్, జీహెచ్ఎంసీ డీసీ రవికుమార్, నాయకులు ధర్మారెడ్డి, పల్లచెరువు మహేష్, రఘుయాదవ్ తదితరులున్నారు.



పత్తికుంట వద్ద ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ తదితరులు

కార్మికులు ఆరోగ్యాన్ని రక్షించుకోవాలి

మణికొండ: నిత్యం మున్సిపాలిటీ పరిధిలోని ప్రజల బాగోగులకోసం పనిచేసే మున్సిపల్ కార్మికులు తమ ఆరోగ్యాలను పరిరక్షించుకోవాలని మణికొండ మున్సిపల్ వైస్ చైర్మెన్ కె.నరేందర్‌రెడ్డి, కమిషనర్ కె. ఫల్గుణ్‌కుమార్, నార్సింగి మున్సిపాలిటీ శానిటేషన్ ఇన్‌చార్జి లచ్చిరాంలు అన్నారు. మంగళవారం మణికొండ మున్సిపాలిటీ కార్యాలయం ఆవరణ, మంచిరేవుల వార్డు కార్యాలయంలో మున్సిపల్ కార్మికులకు ఉచిత ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోజూ , దుమ్ము, దూలిలో పనిచేసే మున్సిపల్ కార్మికులకు ఆరోగ్యాలు చెడిపోతాయని, వారికి తరచూ ఇలాంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్యుల సలహాలు, మందులను అందిస్తామన్నారు. ఎలాంటి అనారోగ్య సమస్యలు వచ్చినా తమకు తెలపాలని, ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులలో వైద్యసేవలను అందిస్తామన్నారు. మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, కౌన్సిలర్లు పురుషోత్తం, మండల వైద్య విస్తరణాధికారి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ యాలాల నరేష్, నాయకులు సి.బీరప్ప, కిరణ్‌కుమార్, రాజేందర్‌గౌడ్, రవికాంత్‌రెడ్డి, శ్రావణకుమార్, రాజేష్ తదితరులున్నారు.



మంచిరేవులలో వైద్యపరీక్షలు చేయించుకుంటున్న కార్మికులు

ఆకట్టుకున్న నాటకరూపకం



ప్రత్యేక పూజల్లో వివేకానంద కాలనీకి చెందిన స్థానిక నేతలు



వివేకానంద కాలనీలో భక్తమార్కండేయ నాటకం

శంషాబాద్: పట్టణంలోని ఆయా మండపాల్లో లంబోధరుడికి విశేష పూజలు నిర్వహిస్తున్నారు. వివేకానందకాలనీలో హిందు వికాస్‌గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడిని వేలాది మంది దర్శించుకున్నారు. సాంప్రదాయల కళలతో గణపయ్యను పూజిస్తున్నారు. మంగళవారం రాత్రి నిర్వహించిన భక్తమార్కండేయ నాటక రూపకం భక్తులను ఆకట్టుకుంది. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, వైస్‌చైర్మన్ బండిగోపాల్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆర్.గణేష్‌గుప్తా, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 29న నిమజ్జనం..

● పట్టణంలోని అన్ని వినాయకులను ఈ నెల 29 రాత్రికి నిమజ్జనం చేయనున్నట్లు ఉత్సవ కమిటీ నిర్వాహకులు ప్రకటించారు. నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించుకునేందుకు కాముని చెరువు వద్ద అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

వచ్చే నెల నుంచి సదరం క్యాంప్‌లు నిర్వహిస్తాం

గోల్కొండ: దివ్యాంగుల కోసం గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో వచ్చే నెల నుంచి సదరం క్యాంప్‌లు నిర్వహిస్తున్నామని తెలంగాణ వైద్య విధానం పరిషత్ డీసీహెచ్ఎస్ డాక్టర్ సునీత అన్నారు. మంగళవారం ఆమె గోల్కొండ ఏరియా ఆస్పత్రిని సందర్శించి ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మజహర్ ఉల్లాతో సదరం క్యాంపు ఏర్పాటుపై చర్చించారు. ఆమె మాట్లాడుతూ..జిల్లా కలెక్టర్ సూచనల మేరకు గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో దివ్యాంగుల కోసం సదరం క్యాంప్ నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని ఆమె తెలిపారు. ప్రతి మంగళవారం గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో సదరం క్యాంప్ ఉంటుందని ఆమె అన్నారు. ఈ క్యాంప్‌కు వచ్చే దివ్యాంగులు ఈ-సేవా కేంద్రంలో తమ పేర్లను నమోదు చేసుకోని స్లాట్ బుక్ చేసుకోని ఆస్పత్రికి రావాలని ఆమె సూచించారు. ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ శ్రీనివాస్‌రావు, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయ సూపరింటెండెంట్ రాములు, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ క్రాంతి తదితరులున్నారు.

బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలి

సుల్తాన్‌బజార్: వైద్య ఆరోగ్యశాఖలో జీఓ నెంబర్: 48 ద్వారా చేపట్టే బదిలీలలో పెరిఫెరిల్ వైద్యులకు అన్యాయం జరుగుతుందని ప్రొఫెసర్ డాక్టర్ నిర్మల దేవి, డాక్టర్ శ్రీకాంత్, అరుణాదేవి, ఆయిషా ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం కోఠి డీఎంఈ కార్యాలయం ముందు వారు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం డీఎంఈ రమేష్‌రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఇటీవల వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు ఇచ్చిన హామీ మేరకు జీఓ నెంబర్:48 లో కేవలం హైదరాబాద్ జిల్లాలో ఉన్న వైద్యులకే న్యాయం జరిగేలా ఉందన్నారు.

అదనపు అంతస్తును నిర్మించాలి

మణికొండ: మణికొండ పాత గ్రామస్తుల కోసం నిర్మిస్తున్న కమ్యూనిటీహాల్‌కు మరో అంతస్తు పెంచి నిర్మాణం చేపడితే మరింత మందికి ఉపయోగకరంగా ఉంటుందని 13వ వార్డు కౌన్సిలర్ బి.శ్వేతారవికాంత్‌రెడ్డి వైస్ చైర్మెన్ కె. నరేందర్‌రెడ్డిని కోరారు. మంగళవారం కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ కోరిక మేరకు రాబోయే మున్సిపల్ సమావేశంలో దీనికి అనుగుణంగా తీర్మాణం చేసి పనులను చేపడతామన్నారు. పనులను త్వరగా పూర్తి చేయాలని, మరో అంతస్తు పెంచుతామని కాంట్రాక్టర్‌కు తెలిపారు. కో– ఆప్షన్ సభ్యురాలు జే.లక్ష్మీరాములు, నాయకులు సి.బీరప్ప, బి.రవికాంత్‌రెడ్డి తదితరులున్నారు.



కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులను పరిశీలించిన మున్సిపల్ వైస్ చైర్మెన్ నరేందర్‌రెడ్డి

చెత్తను వేరుచేసే అందించాలి



డీఆర్‌సీసీ యూనిట్‌ను పరిశీలిస్తున్న త్రివేణి స్కూల్ విద్యార్థులు

మణికొండ: ప్రతి ఇంటి నుంచి బయటకు వచ్చే చెత్తను తడి, పొడిగా వేరు చేసిన తర్వాతే మున్సిపాలిటీ కార్మికులకు అందించాలని నార్సింగి మున్సిపాలిటీ శానిటేషన్ ఇన్‌చార్జి లచ్చిరాం అన్నారు. మున్సిపాలిటీ పరిధి, వట్టినాగులపల్లి శివారులో ఉన్న చెత్త రీసైక్లింగ్, డీఆర్‌సీసీ యూనిట్‌ను ఖానాపూర్ త్రివేణి స్కూల్ విద్యార్థులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తడి, పొడి చెత్తను వేరుచేసి చేపడుతున్న వర్మి కంపోస్టు ఎరువుల తయారీ, పొడిచెత్తను వేరుచేసి కరిగించి ఆర్‌సీసీ బ్లాక్‌లను తయారు చేసే విధానాన్ని చూయించారు. విద్యార్థులు తడి,పొడి చెత్తను ఇంట్లోనే వేరు చేసేలా తమ తల్లులకు తెలియజేయాలని సూచించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ల డిమాండ్లను పరిష్కరించాలి

శంషాబాద్: అంగన్‌వాడీ టీచర్ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బైతి శ్రీధర్ డిమాండ్ చేశారు. 16 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లకు ఆయన మంగళవారం ధర్నాలో పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్లతో ప్రభుత్వం వెట్టి చాకిరి చేయించుకుంటుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు ప్రభుత్వానికి సంబంధించిన ఇతరత్రా పనులతో వారికి మానసిక ఒత్తిడి పెరిగిపోతుందన్నారు. సీఐటీయూ జిల్లా నాయకులు మల్లేష్ తదితరులున్నారు.



అంగన్‌వాడీల ధర్నాలో బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బైతి శ్రీధర్

ఆశావర్కర్ల ధర్నా



ఆశావర్కర్లతో బీజేపీ నేతలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ ఆరాంఘర్ చౌరస్తాలో ఆశావర్కర్లు నిర్వహిస్తున్న ధర్నా కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు. చేవెళ్ల పార్లమెంటు కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న నిరసనలు, ధర్నాలపై కేసీఆర్ చలించకుండా మొద్దు నిద్రావస్థలో ఉన్నట్లు నటిస్తున్నారని వాపోయారు. న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు. బీజేపీ బీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సత్యనారాయణముదిరాజ్, సాబాద విజయ్‌కుమార్, కిరణ్‌చారి, రాజు పహిల్వాన్, శ్రీనివాస్ తదితరులున్నారు.

విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలి

బండ్లగూడ: విద్యార్థులను చిన్ననాటి నుంచే అన్ని రంగాల్లో ప్రోత్సహించాల్సిన బాధ్యత తల్లిదండ్రుల పైనే ఉందని ప్రముఖ చిత్రకారుడు అక్కిరాజు శ్రీహరి వెల్లడించారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మురారి గిరిధారి హోమ్స్‌లో విద్యార్థులు చిత్రప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల చిత్రాలను గీసి అబ్బురపరిచారు. 4–12 ఏళ్ల చిన్నారులు గీసిన చిత్రాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అక్కిరాజు మాట్లాడుతూ.. వినాయక చవితి సంబరాల్లో భాగంగా గణేష్ దర్శన్ అనే చిత్ర ప్రదర్శనను ఏర్పాటు చేశామన్నారు. పిల్లలలోని సృజనాత్మక కళను వెలికి తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



చిత్ర ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు

లడ్డూ వేలం



సాయిరాంనగర్ కాలనీలో లడ్డూ హన్మంత్‌రావు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని సాయిరాంనగర్ కాలనీ వినాయకున్ని నిమజ్జనానికి తరలించారు. పోటాపోటీగా జరిగిన వేలంపాటలో హన్మంత్‌రావు రూ.1.75లక్షలకు దక్కించుకున్నారు. నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలోని లక్ష్మీనగర్ ఫ్రెండ్స్ అసోసియేషన్ లడ్డూ వేణుగౌడ్ రూ.75వేలు, పోచమ్మ గుడి వినాయకుడి లడ్డూను రాము రూ.30వేలకు దక్కించుకున్నారు.



లక్ష్మీనగర్ ఫ్రెండ్స్ అసోసియేషన్ లడ్డూ వేణుగౌడ్

మైలార్‌దేవ్‌పల్లి: డివిజన్ పరిధిలో జరిగిన లడ్డూ వేలంలో భక్తులు లక్షల రూపాయలలో వేలం పాడి స్వామివారి ప్రసాదాన్ని సొంతం చేసుకున్నారు. హనుమాన్ టెంపుల్‌లో గణేష్ లడ్డూను రూ.5,51,000లకు రాజుయాదవ్ కైవసం చేసుకున్నారు. ప్రగతికాలనీలో అక్కెం క్రిష్ణయాదవ్ రూ.2,15,000, పద్మశాలిపురంలో మునుగపాటి వెంకటేష్ రూ.97,000లు, బంగారు మైసమ్మ ఆలయంలోని లడ్డూను బొల్లి గట్టయ్య రూ.2,12,000లకు పాడారు. ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ చేతుల మీదుగా ప్రసాదాన్ని అందుకున్నారు.

చాకలి ఐలమ్మకు ఘన నివాళి

వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను రాజేంద్రనగర్ జోన్ పరిధిలో ఘనంగా నిర్వహించారు. నిజాం నిరంకుశత్వంపై ఆమె చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని పలువురు నేతలు కొనియాడారు. ఆనాడు నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడి, ఆ పోరాటంలో చరిత్రలో నిలిచిన చాకలి ఐలమ్మను స్మరించుకోవాలన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



శంషాబాద్‌లో ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కౌన్సిలర్ కుమార్



ఆరెమైసమ్మ చౌరస్తా వద్ద మున్సిపల్ మేయర్ మహేందర్‌గౌడ్